క్లుప్తంగా

దేవునిపై నమ్మకం ఉంచాలి



కొవ్వలి రక్షణ సువార్త సభల్లో మాట్లాడుతున్న జిల్లా డివిజనల్ కమాండర్ మేజర్ జోషి

దెందులూరు: దేవునిపై నమ్మకం ఉంచి, విశ్వాసం, సేవా, ప్రేమ మార్గాలతో ప్రతి ఒక్కరూ జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవాలని రక్షణ సైన్యం జిల్లా డివిజనల్ కమాండర్ మేజర్ జోషి అన్నారు. కొవ్వలి రక్షణ సైన్యం గ్రౌండ్‌లో స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ ఏ. సుబ్బారావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రక్షణ సువార్తలు సభలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వ్యాఖ్య సందేశాన్ని అందించారు. సంఘ అభివృద్ధికి విశ్వాసులు, సంఘస్థులు, కోర్ ఆఫీసర్ల సహాయ సహకారాలతో చేయూతనందించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లపల్లి నాగేంద్ర మృతి

దెందులూరు: వైఎస్సార్ సీపీ సోమవరప్పాడు గ్రామ అధ్యక్షుడు చల్లపల్లి నాగేంద్ర (75) ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సోమవరప్పాడు గ్రామ శివారు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తల సమన్వయం, పార్టీ అభివృద్ధికి విశేషమైన సేవలందించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు చల్లపల్లి నాగేంద్ర ప్రధాన అనుచరుడు.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం



పెదవేగిలో వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన కేశన సతీష్ తన మాతృమూర్తి కేశన నాగమణి పేరుతో తాగునీటి సరఫరా ట్యాంకర్‌ను కొనుగోలు చేసి వంగూరు పరిసర గ్రామాల్లో జరిగే వివాహాది శుభ కార్యాల అవసరార్థం బహూకరించారు. ఈ ట్యాంకర్‌ను ప్రజలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చని పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసిన మంచినీటి సరఫరా ట్యాంకర్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సచివాలయాల కన్వీనర్ సతీష్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు అభినందించారు.

బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో మెట్ట గ్రామాలకు ప్రధానంగా ఉన్న రామారావుగూడెంలో బుక్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ కోరారు. అప్పారావుపాలెం, శ్రీరామవరం, మేధినరావుపాలెం, రామారావుగూడెం, మలకచర్ల, ధర్మారావుపేట, చల్లచింతలపూడి, పెరుగ్గూడెం గ్రామాల్లోని ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ, బీఈడీ, ఎంఈడీ, ఇతర కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న, విద్యాభ్యాసం పూర్తి చేసిన వేలాది మంది విద్యార్థులకు బుక్ డిపాజిట్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేవలం విద్యార్థులకే కాకుండా 8 గ్రామాల యువతకు పత్రికలు ప్రతి రోజూ చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

ఉంగుటూరు: నేటి నుంచి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు తెలిపారు. పూర్తి చేసిన దరకాస్తులు జూన్ 14 వరకు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధన అందుబాటులో ఉందని, వివరాలకు సెల్ 9441687844 ఫోను చేసి తెలుసుకోవచ్చునని ఆయన వివరించారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

నాగరాజును పరామర్శించిన ఆర్డీవో

ఏలూరు టౌన్/భీమడోలు: అప్పుల విషయంలో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తండ్రీకొడుకులిద్దరిలో కొడుకు యారపుత్తూరి సూర్యనారాయణరాజు మృతి చెందగా తండ్రి నాగరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లిన నేపథ్యంలో ఆదివారం రాత్రి ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గొడవకు గల కారణాలను కుటుంబ సభ్యుల నుంచి ఆయన అడిగి తెలుసుకున్నారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసాయం అందించాలని వైద్యులను ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్ ఆదేశించారు. ఆయన వెంట ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంత్యుత్సవాలు



ఆంజనేయునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



జల్లికొమ్మరలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న వాసుబాబు



గుండుగొలనులోని ఆంజనేయ స్వామి



అడవికొలను ప్రసన్నాంజనేయ స్వామి

పెదవేగి : దెందులూరు నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజల సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి హనుమాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం పెదవేగి మండలం రాయన్నపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంగూరు వద్ద ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథపురంలోని ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెదకడిమిలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సవాలు ప్రారంభం

పెదపాడు: మండలంలోని ఏపూరులోని సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో 73వ హనుమజ్జయంత్యుత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెదపాడు బల్లరేవు తూము సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో 20వ హనుమజ్జయంత్యుత్సవాలు ఆదివారంతో ముగిసాయి. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి విశేష పూజలు చేసారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. నిర్వాహకులు రేములగడ్డ రాము తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెదపాడు లోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం 89వ హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరభద్రపురం ఆలయంలో..

దెందులూరు: హనుమద్ జయంతి వేడుకలు మండలంలో గ్రామగ్రామాన భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వీరభద్రపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు వివిధ రకాల పుష్పాలతో విశిష్టలంకరణ చేశారు.

వాడవాడలా వేడుకలు

భీమడోలు: ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, ఆంజనేయ నగరం తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలకు భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. గుండుగొలనులోని దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని సీతారామస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కొండా గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీసేవలో గ్రామోత్సవం నిర్వహించారు. పోలసానిపల్లి పంచాయతీ పరిధిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జయంత్యుత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనాలు స్వామి వార్లను దర్శించుకున్నారు.

వేదమంత్రోచ్ఛరణతో ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

గణపవరం: జల్లికొమ్మరలో 45 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు రోజులుగా యజ్ఞాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 9.24 గంటలకు వేద పండితుల వేదమంత్రోచ్ఛరణ మధ్య గ్రామస్తుల సమక్షంలో భారీ ఆంజనేయ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామం నడిబొడ్డున మంచినీటి చెరువు వద్ద రూ.50 లక్షల వ్యయంతో 45 అడుగుల ఎత్తు గల ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు అడ్డగర్ల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కురెళ్ల త్రిమూర్తులు, సొసైటీ చైర్‌పర్సన్ బుద్దాల అర్జునరావు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా పూజలు

గణపవరంలోని ప్రముఖ సువర్చాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వంకాయల రామారావు దంపతులు పూజలు నిర్వహించారు. చినరామచంద్రపురంలోని హనుమాన్ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా హనుమజ్జయంతి పూజలు

నిడమర్రు: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నిడమర్రు, అడవికొలను, పెదనింద్రకొలను, పత్తేపురం గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బువ్వనపల్లిలోని అభయాంజనేయ స్వామిని ఎమ్మెల్యే వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, వైస్ సర్పంచ్ వెల్లంకి నరేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సంకు సూర్యప్రకాష్, త్రినాథరావు, వేపకాయల గోపాలం, దూలం శంకరం, సంకు ఏడుకొండలు, కోసూరి త్రినాథ్, సంకు మురళి తదితరులున్నారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం హనుమద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గోపీనాథపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లగూడెం, యర్రమళ్ల, ఉంగుటూరు, బాదంపూడి ఆలయాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఏపూరులో గడపగడపకూ మన ప్రభుత్వం



పెదపాడు మండలంలోని ఏపూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: కుల, మత, వర్గ, పార్టీ బేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు కావాలని, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల రుణం అందించాలని కొంతమంది కోరడంతో వెంటనే సంబంధిత సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా అండగా నిలుస్తామని చెప్పారు. సీఎం జగన్ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. బడి తెరిచిన రోజునే విద్యార్థులకు పాఠశాలల్లో 9 రకాల సామగ్రితో విద్యాకానుక అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి నాడు- నేడు పథకంలో రూ.వేల కోట్ల వ్యయంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమంగా బడికి పంపి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపిచంద్ర దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరరావు బెజవాడ శిరీషా శేఖర్, స్థానిక బెజవాడ నర్సింహరావు, బెజవాడ సత్యనారాయణ, చోడగిరి బిక్షాలు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- తహసీల్దార్ ఎన్ నాగరాజు
- ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు



అమ్మపాలెంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి ప్రియాంక

పెదవేగి : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా కొనుగోలు చేయిస్తామని తహసీల్దార్ ఎస్ నాగరాజు అన్నారు. మండలంలో పలు గ్రామాల శివారున రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మండల అధికారులు పరిశీలించారు. పెదకడిమి, కొప్పాక, అమ్మపాలెం, పినకడిమి, దుగ్గిరాల, బాపిరాజుగూడెం, కూచింపూడి, ముందూరు, భోగాపురం, చక్రాయిగూడెం, అంకన్నగూడెం, వేగివాడ, ఉండ్రాజవరం, కొవ్వలి, తదితర రైతులు ఆ ధాన్యాన్ని అరబెట్టారు. ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు రైతులతో మాట్లాడారు. మిషన్ ద్వారా వరికోత నిర్వహించామని, ధాన్యంలో తేమశాతం ఎక్కు వగా ఉన్నందున ఎండలో ఆరబెట్టామని, మరో రెండురోజుల్లో తేమ తగ్గుతుందని, ఆర్బీకేల ద్వారా అమ్మకాలు జరుపుతామని రైతులు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్మవద్దని, ఆర్బీకేల ద్వారా మద్దతు ధర అందుతుందన్నారు. ఆర్బీకేల్లో గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ధాన్యంలో 17 శాతం మించి తేమ ఉండరాదని, రైతులు ఆర్బీకేలకు వెళితే మిల్లర్లకు ట్యాగ్ చేస్తూ కూపన్లు ఇస్తారన్నారు. మిల్లర్లు నేరుగా రైతుల నుంచే ధాన్యం తీసుకువెళ్లి, వారి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తారన్నారు. 100 కిలోల ధాన్యానికి రూ.2,060 ప్రభుత్వ మద్దతు ధరగా ఉందన్నారు. వ్యవసాయశాఖాధికారి ప్రియాంక మాట్లాడుతూ మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో రబీ వరిని సాగు చేశారన్నారు.

ఆర్బీకేల ద్వారా మద్దతు ధర

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తాం. తేమ 17 శాతం మించి ఉండరాదు. ఆర్బీకేల ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,060 అందుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు.

– ఎన్ నాగరాజు, తహసీల్దార్ పెదవేగి

తల్లిని మించిన దైవం లేదు



చిన్నారులకు క్రీడా పరికరాలను అందిస్తున్న గుల్లా నూకరాజు, పోలిశెట్టి సత్యనారాయణ, భావనరుషి తదితరులు



దెందులూరు గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

భీమడోలు: తల్లిని మించిన దైవం లేదని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ఉల్లాస భరిత వాతావరణలో జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ప్రపంచ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్, రిటైర్డ్ హెచ్ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుల్లా నూకరాజుకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మండల చైర్మన్ గుల్ల నూకరాజు, సత్యేంద్ర స్కూలు ప్రిన్సిపల్ పోలిశెట్టి సత్యనారాయణ, యోగా ట్రైనర్ భావనా రుషి, సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధి చందూకుమార్ పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను విద్యార్థి దశ నుంచి గౌరవించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. తొలుత యోగా ట్రైనర్ భావనరుషి చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. అనంతరం గుల్లా నూకరాజు రూ.5వేల ఆర్థిక సాయంతో చిన్నారులకు క్రీడా పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

దెందులూరు: గ్రంథాలయ శాఖ, అన్ని గ్రంథాలయాల్లో విద్యార్థుల విజ్ఞానానికి, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు గ్రంథాలయ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు వివరించి, కంప్యూటర్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ప్రజల్లో భక్తిభావంతోనే సమాజంలో శాంతి



నూతన ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: ప్రజల్లో భక్తిభావంతోనే సమాజంలో శాంతి పెంపొందుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. దేవరగోపవరంలో భక్తుల సహకారం రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వాసుబాబును పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వా నించారు. ఈ పూజల్లో జెడ్పీటీసీ కోడే కాశి, సర్పంచ్ తుమ్మూరి నారాయణమ్మ కృష్ణరావు, ఉపసర్పంచ్ కందులపాటి మహేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దిరాల బుజ్జి, ఉపాధ్యక్షుడు తుమ్మూరి శ్రీను, గ్రామ సచివాలయం కన్వీనర్ మద్దిపట్ల సుబ్బయ్య తదితరులున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెదపాడు: పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

రజకుల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న
- గొల్లగూడెంలో ఐలమ్మ విగ్రహావిష్కరణ



గొల్లగూడెంలో రజక చెరువు వద్ద ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రజక రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రంగన్న

ఉంగుటూరు: రజకుల అభ్యున్నతికి కృషి చేస్తూ, కులానికి వన్నె తెచ్చేవిధంగా పనిచేస్తున్నానని రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న అన్నారు. ఆదివారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) విగ్రహాన్ని రంగన్న ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు అఖిల భారత దోభీ మహాసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో రంగన్న మాట్లాడుతూ ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని రజకులు చైతన్య వంతులుగా మెలగాలని కోరారు. గ్రామాల్లో రజక చెరువులు అన్యాక్రాంతం కాకుండా పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. 18 రాష్ట్రాల్లో అమలవుతున్న మాదిరిగా మన రాష్ట్రంలో రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చే విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. విగ్రహ దాత వేములపల్లి సుధీర్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో కలిసిమెలిసి ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర చైర్మన్ రంగన్నను స్థానిక రజక సంఘం పెద్దలు శాలువా కప్పి సత్కరించారు. విగ్రహదాత సుధీర్‌ను చైర్మన్ శాలువా కప్పి సత్కకరించారు. సమావేశంలో దోభీ మహా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాసు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు రేవూరి గోగురాజు, ఈగలపాటి యువశ్రీలు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లె శ్రీఆములు, రజక చైతన్యసేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు, నవ్యాంధ్ర రాష్ట్ర రజక సంఘ అధ్యక్షుడు అద్దాల నరసింహారావు, బహుజన కులాల ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాదు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నడిపూడి నానగబాబు, వెలుదుర్తి శ్రీనివాసు, రజక సంఘ నాయకులు ఊనగట్ల నాగపోసి కృష్ణ, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, యండమూరి మహేష్, అంజూరి శ్రీనివాసు, కొండపల్లి దుర్గారావు , స్థానిక వీదులమ్మ తల్లి రజక సేవా సంఘం అధ్యక్షుడు పల్లంట్ల రాంబాబు, కార్యదర్శి ప్రసాదు, వైఎస్సార్ నేత నాగు పాల్గొన్నారు.